కథానిక:

# సంసారంలో ఒకరోజు

రచన:

**మా. వేం. శేషాచార్య**

"అమ్మా! కుంటివాడికి ఇంత బిచ్చం వెయ్యండమ్మా."

అరగంటనుండీ అలాగే కేకేస్తున్నాడా ముష్టివాడు. రాఘవరావు ఏవో ఆఫీసు బాపతు అర్జంటుకాగితాలు చూసుకుంటున్నాడు. క్రితంరోజే శిరస్తాదారు మరీమరీ చెప్పాడు మర్నాడు రెవిన్యూబోర్డుకు కాగితాలు తప్పక పంపాలని. వాచీ చూస్తే అప్పుడే పదికావస్తోంది. చరచరా వంటయింట్లోకి వెళ్ళాడు, భార్య శాంతమ్మ పచ్చడి నూరుతోంది.

"ఏయ్ మొద్దూ! నిన్నే పిల్చేది, గంటనుంచీ ఆ ముష్టివాడలా కేకలేస్తుంటే చూస్తూ నన్ను కాదన్నట్లు ఊరుకుంటావేం. నేనేం పనిచేసుకోవాలా లేదా" అన్నాడు.

"మీరు మాత్రం వెళ్ళమనకూడదా ఏమండీ! కాకపోతే గుప్పెడు బియ్యం వాడి మొహాన వెయ్యకూడదా" అంది శాంతమ్మ నవ్వుతూ.

రాఘవారావుకి ఎక్కడలేని అభిమానం వచ్చింది. పగలస్తమానమూ దిక్కుమాలిన గుమస్తాచాకిరీ చేసి సంసారం గడుపడమే కాకుండా ఈ ముష్టి వెధవల్ని సముదాయించాల్సిన గతికూడా నాకే పట్టిందీ. తను మగవాడు, పైపెచ్చు భర్త, తనమాటకి ఎదురుచెప్పటమే కాకుండా పనులు పురమాయిస్తోంది.

"ఛీ ఛీ! ఈ యింట్లో బతకటానిక్కూడా వీల్లేకుండా ఉంది," అని విసుక్కున్నాడు.

"ఇంతమాత్రానికే జీవితంమీద విరక్తి కలిగితే ఎలాగండీ చచ్చేది?" అంది శాంతమ్మ అమాయికంగా.

"నోర్ముయ్. రాస్కెల్..." అంటూ వాకిట్లోకి వెళ్ళిపోయాడు రాఘవరావు.

* * * *

"వంట అయింది. స్నానానికి లేస్తారా?" లోపలినుంచే కేకేసింది శాంతమ్మ. జవాబు లేదు.

"మరీ ఇంత కోపంఅయితే ఎలాగబ్బా," అనుకుంటూ వీధిగదిలోకొచ్చింది. రాఘవరావు లేడు. వంకీమీద కోటు, టోపీ లేవు. ఆఫీసు కెళ్ళిపోయాడు భోంచెయ్యకుండానే. చేసేది లేక కళ్ళొత్తుకుంది పైట చెరుగుతో.

"ఒకవేళ త్వరగా కాగితాలు ఇవాల్సి ఆఫీసుకి త్వరగా వెళ్ళారేమో. మళ్ళీ వస్తారు బహుశా," అని చాలాసేపు ఎదురుచూచింది శాంతమ్మ. చివరికి విసుగొచ్చి వంటయింటి గుమ్మంలోనే పడుకుంది పైటచెరగు పర్చుకొని. మనస్సేం బావుళ్ళేదు. ఎప్పుడు నిద్రపట్టిందో తనకే తెలీదు. మెలుకువ వచ్చేటప్పటికి 3 గంటలయింది. "కాఫీ వేళకికూడా రాలేదు. బహుశా ఏహోటల్లోనో తాగిఉంటారు. ఎంతో కోపంవస్తేగాని ఇలా చేయరు," అనుకుంది తనలో. గతాన్ని నెమరేసుకుంది ఒక్కసారి. ఇలాంటి సంఘటన తాను కాపరానికి వచ్చిన ఈ రెండేళ్ళలోనూ ఎన్నడూ జరగలేదు. తను అతనికి ఎప్పుడేం కోపం వస్తుందో అని జాగ్రత్తగా మసులుకునేది. ఇంతకీ ఆగోజు లేచినవేళ మంచిది కాదు. చాలాసేపు వెక్కి వెక్కి ఏడ్చింది.

సాయంత్రం చీకటిపడింది ఏడుగంటలకి రాఘవరావు ఇంటికొచ్చాడు. ఎదురువెళ్ళి, "ఇంత ఇదైతే ఎలాగండీ మరీను," అంది శాంతమ్మ ప్రాధేయపూర్వకంగా. రాఘవరావు జవాబు చెప్పకుండా సరాసరి దొడ్లోకి వెళ్ళాడు. కాళ్ళు కడుక్కున్నాడు. ఇంట్లోకొచ్చి ఆఫీసుబట్టలు మార్చి లుంగీ కట్టుకుని వంటయింట్లో కెళ్ళి పీట వేసుక్కూర్చున్నాడు. మళ్ళీ ఏం అంటే ఏం కొంప మునుగుతుందో అని భయపడుతూ విస్తరి వేసి వడ్డన ప్రారంభించింది శాంతమ్మ. రాఘవరావు భోజనం ప్రారంభించాడు.

"నిక్షేపంలాంటి వంకాయకూర వారేస్తారేమండీ. మీ కిష్టం అని యింగువకారం కూరి గుత్తులు వేయిస్తే," అంది.

జవాబురాలేదు. ఎంత ప్రయత్నంచేసినా సంభాషణలోకి దిగేట్టు కనపడలా.

పులుసు పోస్తూ అంది. "అన్నట్టు చెప్పటం మరిచానండోయ్, పక్కింటి సుమిత్రమ్మకి కవలపిల్లలు పుట్టారట."

"ఘనకార్యం చేసిందిలే, నువ్వూ కనలేకపోయావ్ ఒక డజనుమందిని?" అన్నాడు రాఘవరావు విసుగ్గా.

తను భోంచేసి అన్నీ సర్దుకువచ్చేటప్పటికి ముసుగుతన్ని పడుకున్నాడు రాఘవరావు. "కాస్త జరుగుదురూ" అంటూ ప్రక్కగా వత్తిగిల్లింది శాంతమ్మ.

"అప్పుడే పడకయ్యాకపోతే కాస్త కాళ్ళు పట్టరాదూ" అన్నాడు రాఘవరావు ముసుగులోంచే.

కాళ్ళుపడుతూ అంది శాంతమ్మ "ఇంత కోపం మంచులాకరిగిపోయిందే," అని. ఇంతలో పెద్దగాలివీచింది. దీపంఆరిపోయింది. ★


## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టరు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి. రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్ణ విశ్వాసానికి అణన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

**Bharat Kalyan Aushadhalaya.**

Post Bag No 6725 Calcutta (A-P)